కథా నిలయం
5.2.48
శ్రీకాకుళం

# ప రా శ రు డు

## 1

పరాశరుడు వున్నత పాఠశాలలో చదువుతున్నప్పుడే వైలెన్స్ చూశాడు. చదువు పూర్తి అయి పట్టభద్రుడయే నాటికి అంతులేని వైలెన్స్, హిత్యాలు, అర్థంలేని కొట్లాటలు, విద్యార్థుల పోటీలు పెరిగి ప్రెసిడెంట్‌గా యెన్నికయ్యే పాతికేళ్ళ యువకుడు చనిపోయాడు. అమూల్యమైన మానవ జీవితం యెన్నేళ్ళు చదివితే డాక్టరేట్ రాబోతున్నదీ? విద్యను హత్య చేసినట్టే! సరస్వతీ ద్రోహం! దైవభీతి లేనట్టే!

గ్రామాల్లో సరేసరి. వేట కొడవళ్ళతో చంపేయటం, దిక్కు లేని పసివారు, ఆకలి, పని దొరకక, పనిలేక అలమటించి కొండ వాలున చుట్టు గుడిశల్లో కాపురాలు, కూలీ దొరికిననాడు పండగే. నిరుపేదలు, కడుపేదలు ఆ కొద్ది కూలీతోనే తిండీ గుడ్డా సమ కూర్చుకుని, పనిముట్లు గూడా కొనుక్కోవాలి. ఆకూ అలమూ దుంపలూ తిని ప్రాణాలు నిలుపుకుంటున్నారు, అండదండ లేని వృద్ధులు, నిరాధారులై చెత్తలో యేవో వస్తువులు వెతికే బాల బాలికలు కంటబడ్డారు పరాశర్‌కి.

"యేదో వుద్యోగంలో చేరి, చాకిరీ చేస్తూ, ప్రమోషన్ పొంది. రిటైరై వ్యర్థజీవితం గడిపేకన్న, సార్థక జీవితం గడపాలి, ఒడి దుడుకులెదుర్కోవాలి అవసరమొస్తే." అనుకున్నాడు పరాశర్, మొదటి మెట్టుగా హింస తగ్గించి మైత్రీభావం తేవాలి. దీనికి బం ధాలు అడ్డురాకూడదు అనుకున్నాడు, గాంధీ మహాత్ముడు తన

వారికి తెలియజేశాడుట. "నేను దేశసేవలో పాల్గొంటున్నాను. మీరు నామీద ఆశలు పెట్టుకోవద్దు. నేను నా దేశీయులకు బాంధవుడను."

తగాదా పడ్డ బంధువులెవరూ వీలైనంతవరకూ కోర్టుదాకా పోకుండా పెద్దల సమక్షంలో తమ వివాదం చెప్పుకుని పరిష్కరించుకోవాలి అని అలవాటు చేసి కొంత గెలుపు చూశాడు పరాశర్. ప్రైవేట్ బడులు పెట్టించి, బడిలో పాఠం మొదలుకాక ముందు పది నిమిషాలు మోరల్ ఇన్‌స్ట్రక్షన్ అని ఒక పద్ధతి పెట్టించాడు. వంతుల వారీగా వుపాధ్యాయులు, అహింస విలువ, స్నేహం, ఐకమత్యం విలువ చెపుతూ పురాణగాధలు చెపుతారు. పగ తీర్చుకోటం వల్లా, ప్రతిక్రియ చేయటం వల్లా యేమీ ఒరగదు ఆనందమివ్వదు. వ్యధా, చీకటీ, అసంతృప్తీ మిగులుతయ్యి అని కథలు చెపుతారు కొన్నాళ్ళు నృత్య ప్రదర్శనల ద్వారా గీతికలు వాయించి పోటీలు పెట్టి బహుమతులిప్పించి కృతకృత్యుడైనాడు పరాశర్.

2

శ్రమించి ఫండ్స్ సేకరించి, ఒక వుచిత వైద్యశాల పురప్రముఖుల అనుమతితో స్థాపించాడు. ఒక ఘనవైద్యుని నియమించాడు:

అలాగే పెళ్ళిళ్ళు వుపి ముగా శాస్త్రీయముగా జరిపించేందుకు ఒక కళ్యాణ మంటపం కట్టించాడు. వధూవరులు మేజర్లై వుండాలి.

కట్నాల ప్రసక్తి వుండదు. హితులు, స్నేహితులు, సన్నిహితులతో వధూవరుల యిష్టత మీద జరుగుతుంది పెళ్ళి. కొన్ని పెళ్ళిళ్ళు సజావుగానే జరిగినాయి. ఇద్దరూ సమానాస్థాయీ లేక యిద్దరూ కలవారి పిల్లలే పరాశర్ గర్వపడ్డాడు. తాను స్థాపించిన సంస్థ బాగా నడుస్తున్నదని.

ఆనాడు ఆ మందిరంలో జనం గుమిగూడారు. ముందు వాగ్యుద్ధం చేసి, ఆవేశపడి కొట్లాటలోకి దిగారు. ముగిసిన పెళ్ళి చెల్లదంటారు. గొప్ప ఆస్తికి వారసుడు వరుడు, వధువుకి కులం లేదు. అండదండ లేదు. వంచించి, మెడలు వంచి, ఆస్తికోసం పెళ్ళి జరిపించారని కొట్లాట. పరాశర్‌కి బాగానే దిబ్బలు తగిలాయి. తల పగిలి రక్తం కళ్ళబడ్డా. కొట్లాట ఆపారు మగపెళ్ళివారు.

పరాశర్ పెద్దలను పిలిచి కూచోమని విచారణ జరప సున్నాడు, యెవరు యెవరి వంశీయులు తవ్వకం మొదలైంది. నాల్గు తరాల ముందువరకు పియ్యాలవారు అన్నదమ్ముల పిల్లలే. వరుసా వావీ వున్నవారే, సమిష్టి కుటుంబాలే. సమిష్టి వ్యవసాయం చేసిన వారే. ఒకర్ని ఒకరు మోసగించుకుని కోర్టుకెక్కి విడిపోయి దాయాదులైనారు. అలా తవ్వుతూ పోగా తిస్తిపరురాలు వధువే. దొంగ పత్రాలు, ఫోర్జరీలు, లంచాలు అన్నీ చెట్లు చిగిర్చి పైకి లేచినట్లు లేచినాయి,

పరాశరుని చేతులు పట్టుకుని మగపెళ్ళివారు,

"పెళ్ళి ముగిసింది. కోడల్ని గృహప్రవేశానికి యింటికి తీసి కెళ్తాం. క్షమించి పంపండి" అన్నారు.

అతిధులలో ఒక వైద్యుడున్నాడు. ఆయన పరాశర్ అనుయాయి. పరాశర్ గాయం తుడిచి డ్రెస్సింగ్ చేస్తున్నాడు. పరాశర్ బల్లమీద కూచున్నాడు.

"చూశారా? యెంతలో యెంత మార్పు! మనిషి విలువ డబ్బుతో కడ్తున్నారు. ఆనాడే విడిపోకండా, వైరం, ద్వేషం, అసూయా పోగొట్టుకుని, సఖ్యంగా వుండి వుంటే యీ గలభా కొట్లాటా జరగకపోను గదా. యెందరికి తలలు పగిలాయి? యెందరికి గాయాలయాయి? డబ్బుతో వస్తున్నదని తెలగానే బాంధవ్యం ఒప్పుకుంటున్నారు. మనుషులనే ప్రేమించుకోవాలి. వరుడూ వధువూ రక్తంచే ఆకర్షింపబడి ప్రేమించుకున్నారు. యెవరిదే కులమూ అని విచారించలేదు. ప్రేమ యెంత వుదారమైనది! దయ యెంత మేలు చేసింది! వైరం, హింసా, వంచనా విడదీశాయి. ఇప్పటికైనా ఆ విషయాలు గుర్తించండి. అహింసనూ, దయనూ పాటించండి" అని పరాశర్ నవ్వుతూ చెప్తున్నాడు.

వెర్రికేకలు చెవిలో బడినట్టు చూస్తూ ఆస్తి పరాయిపాలు గాలేదని సంతోషించి, మందిరం వదిలారు పెళ్ళి పెద్దలు. వధూవరులతో తల్లిదండ్రులూ వెళ్ళిపోయారు.

ఆదిశంకరులు। అద్వైతవాది, భగవత్స్వరూపులు, నృసింహమూర్తిని ధ్యానిస్తూ "ప్రహ్లాద నారద, పరాశర పుండరీక, వ్యాసాంబరీష శుక శౌనక హృన్నివాస!" అని స్తుతించారు అంటే పరాశరుని గుండెల్లో దయాస్వరూపుడైన శక్తిమంతుడున్నాడని అర్థం. వైరం సమసిపోయి బాంధవ్యం నిలచిందనే సంతోషంలో పరాశర్ యింకా

యెన్ని గాయాలైనయ్యో యెక్కడెక్కడ ప్రాక్చరైందో చూసుకో లేదు. నడవగలిగినంత వరకూ నడిచి, యిక నడవలేక శంకర మఠం కంటబడగానే లోపలికెళ్ళి నేలమీద పడుకున్నాడు.

మెలకువ వచ్చి కళ్లు విప్పేసరికి యెవరిదో పరాయివారి యిల్లు. పూరిల్లు మంచం మీదున్నాడు. ఒకమ్మాయి నిలబడి విసురుతున్నది.

లేచి కూచున్నాడు పరాశర్.

యెవరిల్లిదీ? ఇక్కడెందుకున్నానూ? నువ్వెవరూ? నాకే మైందీ, యీ కట్లేమిటీ? అనడిగాడు.

ఇది మా యిల్లే. మా నాన్న ప్రకృతి వైద్యం చేస్తారు. మంచి నీళ్లకోసం శంకరమఠం ఆవరణలోకి వెళ్తే, కటిక నేలమీద స్మృతి లేక పడివుండి కనిపించారు. యేదో కొట్లాటలో పాల్గొన్నారో లేక కొట్లాట ఆపాలని చూశారో గాయాలై చిట్లినై కమిలినై. మణికట్టు దగ్గర యెముక విరిగింది. కొన్నిచోట్ల రక్తం గడ్డ కట్టింది. పరుగున యింటికొచ్చి మా నాన్నతో చెప్పాను. ఆయనా ఆయన శిష్యులు వచ్చి మిమ్మల్ని స్ట్రెచర్ మీద తీసుకొచ్చారు. ఉష్ణం తాకింది. చిట్లినచోట్ల బంకమట్టి ముద్దవేసి అరిటాకు కప్పి యెండాకు వేసి నారతో కట్టు కట్టారు. కమిలినచోట్ల నవనీతం రావి నీరు సున్నం పల్చగా వేశారు. తక్కిన చిన్నగాయాలు తైలంతో తుడిచి పసుపూ నెయ్యీ కసిందాకు పొడీ కలిపి రావి కట్లు కట్టారు. తీయని గంజి, సగ్గు గంజి, సేమియా పాయసం, పాలూ, పండురసం,

కొబ్బరి నీరూ ధారకం యిస్తున్నాము. ఇవాళ సుదినం జ్వరం దిగిపోయి చెమటలు పట్టినై. అందుకని విసురుతున్నాము. మొహాన చల్లని పట్టీలింక వేయక్కర్లేదన్నాడు మా నాన్న. యేవీ విషాక్తం గాకుండా భద్రతలు తీసుకున్నాడు మా నాన్న" అని పిసినికర్ర బల్లమీదుంచి దణ్ణం పెట్టింది.

తర్వాత వైద్యుడొచ్చాడు. బాగా ఆరోగ్యం చిక్కేవరకూ వెళ్లనీయలేదు.

"పరాశర్! నీ వుద్యమం యిక్కడుండీ చేయచ్చు. సత్యవతి నీకు పరిచర్య చేస్తుంది. తర్ఫీదిచ్చాను. పక్క మారుస్తుంది. పచ్చం వండి పెడుతుంది. ఆహారం అమరుస్తుంది. స్నానం చేయిస్తుంది. నీవు బాగా కోలుకోవాలి" అని వుంచగలిగాడు.

సత్యవతి రాత్రిళ్లు చదువుకుని మెట్రిక్ పరీక్షకు సిద్ధమవుతున్నది. అది గమనించాడు పరాశర్. పొద్దుబోయేందుకు గణితం, చరిత్ర, తెలుగు, ఇంగ్లీషూ, సాంఘికశాస్త్రం, హిందీ, సంస్కృతం బోధించసాగాడు. పురాణగాధలు చెపుతూ రసవత్తరంగా బోధ సాగించాడు. పొద్దుబోయినా నిద్రకు జోగకుండా సత్యవతి తన్మయత్వంతో వినేది. రసాయనశాస్త్రం కుతూహలం కలిగేట్టు ప్రయోగాలు చేసి చూపేవాడు పగలు.

పరీక్ష దగ్గర పడుతున్నది.

"నేనిక వెళ్తాను. నేను చేయాల్సిన పని చాలా వున్నది. మను

గుడుపుల పెళ్లి కొడుకులాగా చూచారు నన్ను. మామూలు మనిషి నిగా అవటమే గాక దృఢంగా గూడా అయినాను. దయాగుణం రూపుదాల్చి సత్యవతిలాగా వచ్చింది. దైవం మీ రూపంలో నన్ను కాపాడి మునుపటికంటె ఆత్మబలం గలవానినిగ చేశాడు' అని సెలవు తీసుకున్నాడు.

పరాశర్‌కి అనుయాయులూ, మిత్రులూ పెరిగారు. బాగా ప్రోత్సాహమిచ్చి మొనేటరీ హెల్పూ తెచ్చారు. వీలున్నచోటల్లా, అవకాశం చిక్కినప్పుడల్లా సంచారం చేస్తూ ఆశ్రిమాలూ, పాఠ శాలలూ, బ్రాంచెస్ స్థాపించి బోధకులను యేర్పాటు చేశారు. వారికి సౌకర్యం కల్పించారు. చదువు చెప్పటమే గాక దయా అహింసా నేర్పుతున్నారు.

ఒక కొత్త అధ్యాపకుడు తన యిష్టత మీదే తక్కువ భృతికి ఒప్పందం చేసుకుని, కుటీరం, దీపం, నీరూ, ఆహార పదార్థాలూ చాలునని కుదిరాడు. ఆ అధ్యాపకుడు పరాశర్‌తో సంభాషణ సాగించాడు,

"బౌద్ధం వ్యాపించి దేశాన్ని నిర్వీర్యం చేసిందని ఒక వాదన వున్నది మిస్టర్ పరాశర్ మనకు బౌద్ధానికి పూర్వం మంచి శస్త్ర చికిత్స వుండేదనీ, అటువంటి పనిముట్లు దొరికాయని పురావస్తు పరిశోధన శాస్త్రజ్ఞులొప్పుకున్నారుట. అహింస అహింస అని శస్త్రచికిత్స నశించిపోయేట్లు బౌద్ధులు చేశారనీ చెప్పుతారు తెల్ల వారొచ్చే మనల్ని నిరాయుధుల్ని చేస్తే, దయా నాన్ వైలెన్స్ అని

బోధిస్తూ పోతే, అభిమానహీనులై, పౌరుషహీనులై, చేతగానివారై పోరూ పిల్లలూ. నేను వైలెన్సును మెచ్చటమూ లేదు, ప్రోత్స హించటమూ లేదనుకోండి, నామటుకు నాకు కొట్లాటలో పాల్గొనట మంటేనే భయం దాన్ని ఆపాలని గూడా ప్రయత్నించను. హత్య జరుగుతుందేమో సాక్షిగా వేసుకుంటారేమో, కోర్టులో హాజరు కమ్మంటారేమోనని, కొట్లాట స్థలం వదిలి పారిపోతాను అని హాస్యాలాడుతూ నవ్వాడు,

"మనం ప్రయత్నించినంత మాత్రానా, ప్రాపగాండా చేసి నంత మాత్రానా అహింస వ్యాపిస్తున్నదా? చూస్తూ వుండిపోయే కన్న శక్తిమేరకు వైలెన్సు ఆపాలనీ అణిచివేయాలనీ ప్రయత్నిస్తూ పోతే పదిశాతమన్నా ఫలితం రావచ్చు, దయా, అహింసా, ప్రేమా, సోదరత్వమూ అంటూ ఒకటవ శతాబ్దంలో మతగురువులు క్రిస్టి యానిటీ వ్యాపింపజేస్తూ, గొంతు చించుకుంటూ కాలి నడకన తిరుగుతూనే వుంటే, మరోవేపు యుద్ధాలు జరుపుతూ క్రూరత్వం బైటపెడుతూనే వున్నారట. వైకింగులూ, శ్వేతహూణులూనేమో. వైకింగులు సముద్రపు దొంగలు ప్రయాణీకుల ఓడలు దోచేసే వారట. డెన్‌మార్క్ దగ్గర ఆగి నేలమీద వ్యాపించ సాగారుట. డేన్సు యెదిరించారు బోధించారు గాని యేమీ లాభించలేదుట. తార్తారులూ, గోబీ యెడారిలో జీవించేవారు చేసే హింస ఆపాలని కరాచర్ అనే బౌద్ధ భిక్షువు మంచి చెపుతూ ప్రాణాలొడ్డాడు. చెంఘిజ్‌ఖాన్ హింసావాది అయినాడు.

బుద్ధునికి మృత్యుదేవత దర్శనమిచ్చి రమ్మనేదట "ఇంకా నేను వేయాల్సినది వున్నది" అనేవాడట వెళ్ళిపోయేదట. చివరికి తను చెప్పినట్లు యెవరూ ఆచరించటం లేదని తథాగతునికే విసు గేసిందట. యుద్ధాలు ఆపలేకపోతున్నానని విచారం గలిగిందట. మృత్యువు నవ్వుతూ వస్తే, "తీసుకుపో" అన్నాడట.

శిష్యుడు యేడుస్తూ 'గురూ! నీవు పోతే మాకు దారిజూపే వారెవరు. ఈ హింస ఆపటమెలాగో చెప్పేదెవరు?' అనడిగాడట.

వానికి శాక్యముని 'అప్పోదీప అపోభవ' అన్నాడట. అంతే గాని నిరాశపరచలేదు. 'నీవే జ్యోతివై దారిచూపు' అన్నాడట. అలాగా ఆపలేం గనక అల్లర్లలో పాల్గొని వేట కొడవళ్ళతో నరక టానికి పరుగెత్తుదామంటారా? హత్య చేస్తే వురిశిక్ష పడుతుందని చట్టం పెట్టారు. చట్టం యొక్క ఆశయిం వైలెన్సును కంట్రోల్ చేయాలనే అన్నాడావేశంతో.

గౌతమునిలాగే బాగా వాదిస్తారు అన్నాడు వుపాధ్యాయుడు. ఆయనింక పరాశర్ జోలికి పోలేదు. తన విధి నిర్వహణ చేశాడు.

3

పరాశరుడీమాటు అల్లర్లు కొట్లాటలు జరిగేచోటికి పోయి తల దూర్చి ప్రశాంతంగా యెన్నికలు జరుపుకోవాలి, బాలెట్‌తో పోరాడాలి. బుల్లెట్స్‌తో గాదు. గెలిచి యేమి చేస్తారు? మీ మాని ఫెస్టో యేమిటి? మళ్ళా కొట్టుకోండి అనేనా, మీరు సివిలైజ్డ్ పీపుల్

కాదా? బార్బరస్ పీపులా? ఇది అడివా? విశ్వవిద్యాలయమా? కంట్రోల్ చేసుకోండి అని అరుస్తూ ఆపుతున్నాడు. కాలు విరిగింది కూలిపోతూ స్మృతి కోల్పోతూ గూడా వేడుకున్నాడు. అల్లరి కొట్లాటా ఆగింది గానీ స్టూడెంట్స్ భయపడి చేతుల్లో కెత్తుకుని యెక్కడ చేర్చమన్నారు? అని అడిగారు. సత్యవతి చిరునామా చెపుతూ స్పృహ కోల్పోయాడు పరాశర్. స్టూడెంట్స్ అంబులెన్సు తెప్పించి అయన చెప్పినచోట దిగవిడిచి వెళ్ళిపోయారు.

మళ్ళా ప్రకృతి వైద్యంతోనే సత్యవతి శుశ్రూషతోనే కాలు చక్కబడి నడవగలిగాడు పరాశర్. కాని వింతేమిటంటే ఒక మూడు సంవత్సరాల పిల్లవాడు గూడా సత్యవతికి సాయపడుతూ తాను చేయగలిగిన పరిచర్య చేస్తూ వీవనతో విసురుతూ, ఆహారం తెచ్చి ముందుంచుతూ, తినేంత సేపూ కబుర్లు చెపుతూనే వున్నాడు. నల్లని జుట్టు, పెద్ద కళ్ళు, పాటలు పాడతాడు, కోమలగిరి నిలయా దయామయా అనే పాట తీయగా పాడాడు. భేదములేటికిరా కుల మత? సోదరభావము నాశమందగా। నేనూ నాదీ నిఖిలంబను చూపోడకు మాసాటి జనంబుల! అని వచ్చీరాని భాష వాడుతూ అభినయిస్తాడు, గంతులేస్తాడు.

ఆ బిడ్డ చేయి పట్టుకుని నడవగలిగాడు పరాశర్,

సత్యవతీ! నీవు పట్టభద్రురాలవై సంతాన నిరోధక పద్ధతులు అవలంబిస్తావనుకున్నాను సుమా! అని నవ్వాడు పరాశర్.

అది నాకు హింసలాగా హత్యలాగా తోచింది. అందుకని

ఆ పద్ధతి నాకు గౌరవంగా లేదు. దైవమిస్తున్నాడు అనుకున్నాను. గొప్పవాడికే పుట్టాడు గదా. క్రూరునికీ, హింసావాదికీ, లోభికీ, అసమర్థునికీ, విచక్షణజ్ఞానం లేనివానికీ పుట్టలేదే నా కొడుకు అని తల వంచుకున్నది సత్యవతి.

పరాశర్ పెద్దగా నవ్వాడు. భలే బాగా వోడించావు నన్ను సత్యవతీ! అన్నాడు.

వైద్యుడైన గురువు అందగానే అడిగాడు పరాశర్. గురువు గారూ! నేను పోవాలి. నాకు బంధం యేర్పరిచింది సత్యవతి ఇదీ బాగానే వున్నది. వీడిని గొప్పవాడిని చేయమని అవకాశం కల్పించాడు దైవము, మీకేమైనా సంఘటీతి అనే పదంతో గౌరవహాని అని తలస్తే పెళ్ళి జరుపుకుంటాను యిక్కడే.

నీ కల్చర్ గొప్పదే పరాశర్! కాని సత్యవతి తల్లి బయాగ్రఫీ వింటే అలా అడిగి వుండవేమోనని నా అభిప్రాయం, చిన్న మాటలో తల్లి యెటువంటిదనచ్చంటే స్వైరిణి అంటే సరీగ్గా సరిపోతుంది, గురువు నిర్మలంగా నవ్వుతూ అన్నాడు.

ఈ కూతుర్నిలా పెంచాలనే, తల్లి వదిలి వెళ్ళిపోతే సంతోషించి పెంచుకున్నాను అన్నాడు గురువు.

నేను మీకింకా అర్థం గాలేదు గురువుగారూ! భృగుమహర్షి భార్య పేరు నేను వినలేదు. కూతుర్ని పెంచాడనే విన్నాను అన్నాడు పరాశర్.

చాలా థాంక్స్ పరాశర్! మహర్షి గురువూ సమర్థుడితో పోల్చావు నన్ను.

వీడికి పేరు పెట్టారా? అన్నాడు తల నిమురుతూ.

లేదు నువే పెట్టాలి. మాకు మంచి పేర్లు తెలియవు. నదుల పేర్లు, చెట్ల పేర్లు, కొండలపేర్లూ పెడతాము. మాకు బియాస్ అనే జీవనది దగ్గర్లోనే వున్నది. మంచినీటి నిస్తుంది. బియాసా అని పిలుస్తున్నాము, బిడ్డకి మీ అలవాట్లే వచ్చినాయి. యిప్పటినించే తోటిపిల్లల్ని కొట్టుకోనీయడు, అడ్డు పడతాడు, లాగేస్తాడు, సముదా యించుతాడు. ఆటపాటలతో వినోదించటం నేర్పుతాడు. పళ్ళు కోసి యిచ్చి వూరడిస్తాడు అని పొగిడాడు బియాసాను.

నేను వీళ్ళిద్దరినీ తీసికెళ్ళాలనుకుంటున్నాను, మీకేమైనా అభ్యంతరమా?

లేదు, నేను పెంచి పెద్దచేయాల్సిన కూనలింకా వున్నారు. నిరాక్షేపణీయంగా వీరిని తీసికెళ్ళచ్చు.

4

పరాశర్ తన వారిని చూడటానికి వెళ్ళి, పెద్దలను సంప్రదించాడు.

మీకేమైనా ఆక్షేపణ వున్నదా?

వున్నది. మొదటిది తంతు లేదు. రెండవది కులమూ వంశమూ, ఆచార వ్యవహారాలూ తెలియవు. మనలో యిమడ

దేమో, అటవికురాలల్లే వున్నది చూస్తే. మాటలే వేరు. మేమామె అడుగులకు మడుగులొత్తము అన్నారు నిష్కర్షగా.

ఆ(హాఁ(! అలాగా! అర్థమైంది. పోయేదేమీ లేదు. మీరన్న వన్నీ జరిగినా, అమె నాకు ప్రతికూలమైతే, ఆమెతో జీవితం దుర్భరం గాదూ? నేనెల్లప్పుడూ మీవాడనే అని చెప్పి వెళ్ళి పోయాడు.

5

నేడు పరాశర్ నలుగురు బిడ్డల్ని తన ఆశయాలకూ, ఆద ర్శాలకు అనుగుణంగా పెంచుతున్నాడు.

సత్యవతిని గూడా నేర్పుగా తనకనుకూలంగా మలుచు కున్నాడు తను స్థాపించిన పాఠశాలలోనే సత్యవతి ముఖ్య వుపాధ్యాయురాలుగా పని చేస్తున్నది.

కాలం గడుస్తుండగా పరాశర్ పిల్లలు పెద్ద చదువులూ, పెద్ద వుద్యోగాలూ, ధనార్జనలో ఆసక్తి చూపినా, పెళ్ళి పిల్లల్ని కనటం మళ్లా వారికి పెళ్లి వారు పిల్లల్ని కనటం అంత ముఖ్యం కాదని, విశ్వశాంతికై, అంతర్జాతీయ మైత్రీ సౌభ్రాతృత్వానికై సభలూ సమావేశాలు యేర్పాటు చేస్తారు. వాటిల్లో పాల్గొంటారు. దయ, అహింస, నిజాయితీ, సత్యమూ, శౌచము ధర్మమునందాసక్తి కలిగి వుండాలని స్పీచెస్ యిస్తారు.

సాంస్కృతిక మార్పిడీ అనే పద్ధతి పెట్టి, విదేశీయులతో స్నేహం పెంపొందిస్తారు. కల్చరల్ అసోసియేషన్ అనే సంస్థ నడుపుతున్నారు. హెూదా, పదవీ, ధనమూ అబ్బినా సామాన్య లము అనుకుంటారు. సామాన్యులను గౌరవిస్తారు.

ఆ విధంగా పరాశర్ తన ఆశయం నెరవేర్చుకో గలిగాడు. అలా అని అయినవారిని త్యజించలేదు, నిరాదరించలేదు. వారికీ తను వెళ్లిన మార్గం చూపుతూనే వున్నాడు. ఆ మార్గాన వెళ్తే సంతోషిస్తాడు.

యుద్ధాలు ఆపాలని చూశారు. ఆగాయా? చరిత్ర మారిందా? కల్పం తరవాత కల్పం గడిచిపోయింది అనుకుంటాడు పరాశర్.

[] [] []